TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక


MANA VELUGU TELUGU DAILY

సంపుటి : 01 సంచిక : 300 | సోమవారం జూలై 07 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990



## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం: భట్టి విక్రమార్క

ఖమ్మం:
పేదల సొంతింటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే సాధ్యమవుతుందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లాలో సొంత నియోజకవర్గం మధిరలో పర్యటించిన ఆయన.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదల బాధలను అర్థం చేసుకొని ప్రజా ప్రభుత్వం రూ.22,500 కోట్లతో తొలి ఏడాది 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇన్ని ఇళ్లు ఇచ్చిన చరిత్ర లేదన్నారు. రాష్ట్రంలో 1.20కోట్ల కుటుంబాలు ఉంటే.. 93లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చి వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. రూ.8వేల కోట్లతో నిరుద్యోగుల కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు.భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలనలో పేదల కోసం ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని భట్టి విక్రమార్క విమర్శించారు. రైతుభరోసా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.17,500 కోట్లు చెల్లించిదని చెప్పారు. రూ.లక్ష కోట్లతో డ్వాక్రా మహిళలకు రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం మధిర పట్టణ ప్రగతిలో మరో కీలక మైలు రాయిగా నిలిచే రూ.6.45 కోట్లతో చేపట్టిన మధిరలోని అంబారుపేట పెద్ద చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.



## అబద్ధాలను గోబెల్స్‌కు మించి ప్రచారం చేయడం హరీశ్‌రావుకు అలవాటు: ఉత్తమ్

హైదరాబాద్:
మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. రైతులు బాగుంటే భారత రాష్ట్ర సమితి నేతలు ఓర్వలేకపోతున్నారా? అని ప్రశ్నించారు. "కుంగిన బ్యారేజీల్లో నీళ్లు ఎత్తిపోయాలా?అబద్ధాలను గోబెల్స్‌కు మించి ప్రచారం చేయటం హరీశ్‌రావుకు అలవాటు. రాష్ట్రంలో వానాకాలం, యాసంగిలో రికార్డు స్థాయిలో వరి దిగుబడి వచ్చింది. కల్వకుర్తి లిఫ్ట్ ఎప్పుడు ఆన్ చేయాలో మాకు తెలుసు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. కన్నెపల్లి, కల్వకుర్తి వద్ద మోటార్లను ఆన్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని హరీశ్‌రావు ఆదివారం మధ్యాహ్నం విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి విలువ తెలియని వాళ్లు పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలపై కోపంతో రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఉత్తమ్ స్పందించారు.

## చరిత్ర సృష్టించిన టీమిండియా..! ఇంగ్లాండ్‌పై రెండో టెస్టులో అపూర్వ విజయం




2 లో

## తెలంగాణలో 1,07,218 ఇంజినీరింగ్ సీట్లు

### - ఉన్నత విద్యామండలి ప్రకటన

హైదరాబాద్:
తెలంగాణ ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభం నేపథ్యంలో ఉన్నత విద్యా మండలి కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఎన్ని ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి? వాటిలో భర్తీ చేసే సీట్ల వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తంగా 171 ఇంజినీరింగ్ కళాశాలల్లో 1,07,218 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపింది. వీటిలో కన్వీనర్ కోటా (70శాతం) కింద 76,795 సీట్లు భర్తీ చేస్తున్నట్లు స్పష్టం చేస్తూ ప్రత్యేక జాబితాను విడుదల చేసింది.మరోవైపు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు జులై 8వ తేదీ ఆఖరి గడువు అని తెలిపింది. అడ్మిషన్ల కోసం 95,654మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని.. 76,494మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారని తెలంగాణ సాంకేతిక విద్య కమిషనర్, టీజీ ఈఏపీసెట్ కన్వీనర్ ఎ. శ్రీదేవసేన ఓ ప్రకటనలో తెలిపారు

## ప్రాణం తీసుకున్న బీటెక్ విద్యార్థిని.. కారణం ఆమె స్నేహితులే!




హైదరాబాద్:
చదువు విజ్ఞానాన్ని ఇస్తుంది. చదువు ఎలా బతకాలో నేర్పిస్తుంది. చక్కటి చదువు మంచి నడవడికను నేర్పిస్తుంది. కానీ ఆ యువతి విషయంలో చదివే మరణ శాసనం రాసింది. అవును స్నేహితుల వేధింపులే ఆమెకు శాపంగా మారాయి.

2లో..

## ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో వెళ్లి మోటార్లు ఆన్ చేస్తాం

### - హరీశ్‌రావు హెచ్చరిక



2 లో

హైదరాబాద్:
కన్నెపల్లి, కల్వకుర్తి వద్ద మోటార్లను ఆన్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి విలువ తెలియని వాళ్లు పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలపై కోపంతో రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు."మేడిగడ్డ నుంచి 73,600 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. నీటిని తీసుకునే అవకాశం ఉన్నా.. ఎందుకు తీసుకోవట్లేదు?. నీటిని ఎత్తిపోసేందుకు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు. మోటార్లు ఆన్ చేస్తే 15 జిల్లాలకు సాగునీరు అందుతుంది. ఎస్సారెస్పీ కింద పంటలు వేయాలా.. వద్దా? అని రైతులు ఆలోచిస్తున్నారు.

## సీఎం రేవంత్‌కు భాజపా లేఖ..


### – మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్



హైదరాబాద్:
తెలంగాణ భాజపా అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాయడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. మోదీ సర్కార్ ఫెయిల్యూర్స్ సంగతేంటని ప్రశ్నించారు. "11ఏళ్ల క్రితం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా దేశ ప్రజలను అడుగడుగునా వంచించింది. గత 3 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రధాని విస్మరించి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు.

2లో..

## కృత్రిమ కొరత సృష్టించింది ఎవరో వెంటనే విచారణ జరిపించాలి: కేటీఆర్



హైదరాబాద్:
కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా, రైతు రుణమాఫీ మాత్రమే కాదు.. ఎరువులకు కూడా కరవొచ్చిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. అప్పు తెచ్చి వ్యవసాయం చేద్దామన్నా.. కనీసం ఎరువు బస్తా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఎందుకు ఉందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 266 రూపాయలు ఉండాల్సిన యూరియా బస్తా ధర.. ఇప్పుడు రూ.325కి చేరిందని, ఇందుకు కారణం ఏమిటని నిలదీశారు. కృత్రిమ కొరత సృష్టించింది ఎవరో వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## పాశమైలారం ఘటన.. 42కి చేరిన మృతులు



పాశమైలారం:
సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 42కి చేరింది. ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం జితేందర్‌తో పాటు మరో వ్యక్తి మృతి చెందారు. ఈ ప్రమాదంలో గల్లంతైన తొమ్మిది మందిలో ఒకరి శరీర భాగాలు లభ్యమయ్యాయి. ఇంకా 8 మంది కార్మికుల ఆచూకీ తెలియాల్సి ఉంది. పేలుడు ధాటికి కుప్పకూలిన భవనం శిథిలాల తొలగింపు జరుగుతోంది. ఇక్కడ ఏడో రోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.


## రోజుకు 10 గంటలు పనిచేయొచ్చు!

- కానీ వారానికి 48 పని గంటలు మించొద్దు
- సులభతర వాణిజ్య విధానానికి సర్కారు నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్:
సులభతర వాణిజ్య విధానం కోసం వాణి జ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పనివేళల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇకపై వాణిజ్య సంస్థల్లో (దుకాణాలు మినహా) పనిచేసే ఒక ఉద్యోగి రోజుకు పది గంటల వరకు విధులు నిర్వర్తించే అవకాశం కల్పించింది.అయితే వారంలో 48 గంటలకు మించి పనిచేయకూడదనే నిబంధన విధించింది. రోజుకు 10 గంటల పనికి అవకాశం ఇచ్చినా, ఆరుగంటల తర్వాత అరగంట పాటు విశ్రాంతి ఇవ్వాలి.

మిగతాది 2లో



## గిగ్ వర్కర్స్ కోసం త్వరలో కొత్త చట్టం తీసుకొస్తాం: మంత్రి వివేక్ వెంకటస్వామి

ఆదివారం ( జులై 6 ) గోదావరిఖనిలో మంత్రి వివేక్ వెంకటస్వామికి సన్మానం చేశారు కార్మిక సంఘాల నాయకులు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి.

# సంపాదకీయం

## చెట్టునే నరకనా... మెడ కోసుకోనా?

ఆంధ్రప్రదేశ్‌లోని తోతాపురి మామిడి రైతుల హాహాకారాలు ఆ రాష్ట్ర సరిహద్దుల్ని దాటి ప్రతిధ్వనిస్తున్నాయి. కిలోకు పన్నెండు రూపాయలు కనీస ధరగా నిర్ణయించిన ప్రభుత్వం కార్యాచరణపై మాత్రం ముసుగేసింది. ఫలితంగా రెండు రూపాయలకు కూడా కొనే నాథుడు లేక రైతులు మామిడి కాయల్ని రోడ్లపై పారబోస్తున్న దృశ్యాలు దర్శనమిచ్చాయి. పారబోయడానికి మనసొప్పని రైతులు రవాణా ఖర్చులు వచ్చినా చాలని హైదరాబాద్ వంటి దూర ప్రాంత మార్కెట్లకు తరలించిన ఉదంతాలు కోకొల్లలు. తీవ్రమైన నష్టాల్లో కూరుకుపోతున్న ఈ పరిస్థితుల్లో పసిబిడ్డల్లా పెంచుకున్న చెట్లను నరికేయాలో, చేతిలో వున్న కొడవలితో మెడనే నరుక్కోవాలో అర్థం కావడం లేదంటూ ఒక రైతు వాట్సప్‌లో పెట్టిన మెసేజ్ కంటతడి పెట్టించింది.ఇదొక్క మామిడి రైతుల ఆక్రందనే కాదు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రైతులందరి ఉమ్మడి ఆవేదన ఇదే. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్వింటాల్‌కు 24 వేలు పలికిన ధర ఇప్పుడు గరిష్ఠంగా ఏడు వేలు దాటకపోవడంతో మిర్చి రైతు కుదేలయ్యాడు. పత్తి ధర పదివేల నుంచి ఐదు వేలకు అంటే సగానికి సగం పడిపోయింది. అప్పుడు 18 వేల దాకా దక్కించుకున్న పొగాకు ఇప్పుడు గరిష్ఠంగా 6 వేలకు పడిపోయింది.పసుపు, కందులు, మినుములు, వేరుశనగ, మొక్కజొన్న, పెసలు, ఉల్లిపాయలు, టమాటా, మామిడిపళ్ళు, అరటి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ వగైరా వ్యవసాయ ఉత్పత్తుల ధరలన్నీ సగానికి పడిపోయాయి. ఆనాటి జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి ధరలు పతనమవకుండా మార్కెట్‌లో జోక్యం చేసుకునే విధానాన్ని అవలంబించడం సత్ఫలితాలనిచ్చి మంచి ధరలు లభించాయి. రైతన్నకు దరహాసాన్నిచ్చాయి.చంద్రబాబు ప్రభుత్వం ఆ బాధ్యతను వదిలేసింది. మొత్తంగా వ్యవసాయ రంగానికి సంబంధించినంత వరకు ఈ ప్రభుత్వం కాడి పారేసింది. జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న రైతు భరోసా కంటే అధికంగా ఇస్తానని హామీ ఇచ్చి వరసగా రెండో యేడు కూడా ఎగనామం పెట్టింది. వ్యవసాయ రంగం ఈ ప్రభుత్వ ప్రాధాన్యత క్రమంలో లేదు. తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడే కేంద్రం కట్టాల్సిన పోలవరాన్ని అడిగి తెచ్చుకొని తన కమీషన్ల ప్రాధాన్యాన్ని ఆ ప్రభుత్వం చాటి చెప్పుకున్నది. రెండోసారి అదే ప్రాధాన్యతను అమరావతి రూపంలో నిలబెట్టుకొన్నది. క్వాంటమ్ వ్యాలీ, డీప్ టెక్నాలజీ, ఏఐ వగైరాలన్నీ అమరావతి హైప్ కోసం కైపెక్కించడం తప్ప ఆచరణాత్మకమైన మాటలు కావనే అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. క్వాంటమ్ వ్యాలీకి అవసరమయ్యే ఎకో సిస్టమ్ అమరావతికి అందుబాటులోకి రావడమనేది ఒక సుదూర స్వప్నమే తప్ప ప్రభుత్వం చెబుతున్నట్టు ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించే స్థితి అసంభవమని నిపుణులు చెబుతున్నారు. మధ్యతరగతిని మభ్యపెట్టడానికి యువతకు జోల పాడటానికి ఇటువంటి పదజాలాన్ని వెదజల్లడం బాబు కాకస్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఈ జోలపాటల మాటున అమరావతిలో జరుగుతున్న అసలు కార్యక్రమమేమిటో చాలామందికి అర్థమైంది.అమరావతి పేరుతో ఇప్పటికే తెచ్చిన అప్పులే కాదు, ఇంకా అవసరమైన అప్పులు తీర్చడానికి భూములు అమ్ముతామనీ, అదో సెల్ఫ్ ఫైనాన్స్ కేపిటలనీ చెబుతూ వచ్చారు. తొలుత సమీకరించిన భూముల్లో రైతుల వాటా తీసేయగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవసరాలకు పోనూ మిగిలిన భూముల అమ్మకంతో తెచ్చిన అప్పులు తీర్చడం సాధ్యం కాదనే మాట వినిపిస్తున్నది. ఈ తత్వం బోధపడినందువల్లనే ప్రపంచ బ్యాంకు వాళ్లు ఈ మధ్య ప్రభుత్వానికి తాఖీదులు పంపారట! మీరు అమ్మబోయే భూములెన్ని? ఎప్పటిలోగా అమ్ముతారు? వాటి ద్వారా ఎంత డబ్బు సమీకరిస్తారో చెప్పండని వారు అడుగుతున్నారని సమాచారం.ఇప్పుడు కొత్తగా 45 వేల ఎకరాల భూసేకరణ ప్రయత్నాలకు రైతులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వంలో కలవరం మొదలైనట్టు కనిపిస్తున్నది. కాకస్ పరంగా ఎంత సంపాదించుకున్నా ప్రభుత్వపరంగా మాత్రం అమరావతి ప్రాజెక్టు ఒక నిరర్థక ఆస్తిగానే మిగిలిపోయే ప్రమాదముందనే హెచ్చరికలు వినబడుతున్నాయి. పోలవరం %-% బనకచర్ల ప్రాజెక్టు పేరుతో ఈ మధ్యకాలంలో బాబు ప్రభుత్వం చేస్తున్న హడావుడి కూడా కమీషన్ల స్టార్టప్ కథేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 80 వేల కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో గేమ్ ఛేంజర్ కాబోతున్నదని ఆయన చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నివేదికలో పేర్కొన్న సమాచారం ప్రకారం, ఇది పూర్తయితే ఏడు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకూ, ఇంకో 23 లక్షల ఎకరాల స్థిరీకరణకూ ఉపయోగపడుతుంది. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభించి చాలావరకు పూర్తయి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇంకో 14 వేల కోట్లు సరిపోతుందనీ, ఈ పని చేస్తే కూడా అంత ఆయకట్టు అందుబాటులోకి వస్తుందనీ చెబుతున్నారు.అటువంటప్పుడు ఏది తొలి ప్రాధాన్యత కావాలి? 14 వేల కోట్లతో పెండింగ్ పనులు పూర్తి చేయడమా? 80 వేల కోట్లతో కొత్త ప్రాజెక్టును తలకెత్తుకోవడమా? గోదావరి వరద జలాలను ఉపయోగించుకోవాలన్న ఆలోచన ఆ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అవసరమే కావచ్చు. ఈ ఆలోచన కూడా వాస్తవానికి గత ప్రభుత్వంలో వచ్చినదే. కానీ సత్వరం పూర్తి కావలసిన ప్రాజెక్టులకు పైసా విదల్చకుండా చేపట్టిన ఈ నిర్హేతుకమైన ప్రాధాన్యతాక్రమం దేన్ని సూచిస్తుంది? భారీ ప్రాజెక్టుతో భారీ కమీషన్ల దురాశతోనే ఈ రకమైన ఎంపిక చేసుకున్నారంటే తప్పవుతుందా? రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర ఇప్పించలేకపోయిన ప్రభుత్వం, ఉన్న ఊరిలోనే కల్తీలేని విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెస్తున్న ఆర్‌బీకేలను మూసి పారేసిన ప్రభుత్వం రైతన్నల కన్నీరు తుడవడానికి భారీ ప్రాజెక్టులను సంకల్పించిందంటే నమ్మశక్యమేనా?ఆలూ లేదు, చూలూ లేదు అన్నట్టుగా బాబు ఈ ప్రాజెక్టును పూర్తిచేసే అవకాశమే లేనప్పటికీ దీనిపై తెలంగాణలోని అధికార ప్రతిపక్షాలు సిగపట్లకు దిగడం ఒక విశేషం. చంద్రబాబుతో సాన్నిహిత్యం కారణంగానే ఆయన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. దీనిపై గత కొన్ని వారాలుగా తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఈ పంచాయితీలో బీఆర్ఎస్ వాదానిదే పైచేయిగా ఉన్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దానికి ఇతరత్రా కారణాలు కూడా కొన్ని దోహదపడి ఉండవచ్చు. ప్రెస్‌మీట్లలో కాదు, అసెంబ్లీలో చర్చిద్దాం రండని తాజాగా కాంగ్రెస్ మంత్రులు సవాల్ విసురుతున్నారు. పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఏ ప్రాజెక్టునూ పూర్తిచేసిన రికార్డు లేని చంద్రబాబు చిటికెల పందిరిని ఆంధ్ర ప్రజలెవరూ పట్టించుకోకపోయినా తెలంగాణలో అది మంట పుట్టించడం విశేషం.ఒకపక్క అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల రూపంలో భారతీయ రైతును బలిపీఠమెక్కించే సూచనలు పొడసూపుతున్నాయి. వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా విధించిన మూడు మాసాల గడువు ఈ నెల తొమ్మిదో తేదీతో ముగిసిపోనున్నది. ఈలోగా భారత్‌తో కనీసం మినీ ఒప్పందమైనా జరగాలని ట్రంప్ పట్టుపడుతున్నారు. రెండు దేశాల ప్రతినిధుల మధ్య గత వారం రోజులుగా చర్చోపచర్చలు జరుగున్నాయి. జన్యుమార్పిడి సోయాచిక్కుడు, మొక్కజొన్నలను, యాపిల్స్‌ను, డెయిరీ ఉత్పత్తులను తక్కువ సుంకాలతో భారత మార్కెట్‌లోకి అనుమతించాలని అమెరికా డిమాండ్ చేస్తున్నది. వందల ఎకరాల భారీ కమతాల్లో పూర్తిగా యంత్రాల సాయంతో, దాదాపు యాభై శాతం సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం దన్నుతో చౌకగా వచ్చే అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు తక్కువ సుంకాలతోనే మళ్లీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తే భారతీయ రైతు తట్టుకోగలడా? పైగా భారతీయ వ్యవసాయ రంగంలోకి, ఫుడ్ చెయిన్‌లోకి జన్యుమార్పిడి ఉత్పత్తులను అనుమతించకపోవడం భారత్ విధానంగా ఉంటూ వస్తున్నది.

## ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో వెళ్లి మోటార్లు ఆన్ చేస్తాం

మొదటిపేజీ తరువాయి
మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం ఎందుకు ఆలోచిస్తోంది. పోలవరంలో దయాఫ్రంవాల్ కొట్టుకుపోతే అక్కడికి ఎన్‌డీఎస్‌ఏ ఎందుకు పోలేదు? ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిపోతే ఎందుకు రాలేదు?

**కేసీఆర్ నాయకత్వంలో కదులుతాం**

కన్నెపల్లి, కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయకపోతే రైతులతో కలసి ఉద్యమిస్తాం. శ్రీశైలానికి వరద వచ్చి 36 రోజులైనా కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయలేదు. రెండు రోజుల్లో శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం ఉంది. వెంటనే ఆన్ చేస్తారో.. లేదో ప్రభుత్వం ఆలోచించుకోవాలి. ఉత్తర తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సాగు, తాగునీటి ఇబ్బంది వచ్చే అవకాశం ఉంది. వెంటనే కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేయాలి. కాళేశ్వరం కింద లక్షలాది ఎకరాలకు నీరు అందించాలి. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే కేసీఆర్ నాయకత్వంలో కదులుతాం. అన్ని జిల్లాల రైతులతో వెళ్లి కన్నెపల్లి మోటార్లు ఆన్ చేస్తాం. పరిస్థితి తీవ్రస్థాయికి చేరకముందే కళ్లు తెరిచి రైతులకు సాగునీరు ఇవ్వాలి.కేసీఆర్ ఆదేశాలతోనే ప్రెస్‌మీట్ పెట్టాం. ఆయనే నాయకత్వం వహిస్తానని చెప్పారు. ప్రభుత్వం నీళ్లు ఇస్తే మంచిది. మోటార్లు ఆన్ చేసి నీళ్లు ఎత్తిపోయకుంటే రైతులతో కదులుతాం. వారి ప్రయోజనాల కోసం ఎంతవరకైనా పోరాడతాం. రాష్ట్ర, రైతుల ప్రయోజనాల కోసం పోరాటం చేస్తామని కేసీఆర్ చెప్పారు.” అని హరీశ్‌రావు తెలిపారు.

## ప్రాణం తీసుకున్న బీటెక్ విద్యార్థిని.. కారణం ఆమె స్నేహితులే!

మొదటిపేజీ తరువాయి
బాగా చదవడం లేదంటూ చేసిన ఏగతాళి మాటలు ఆమెను తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లింది. తోటి స్నేహితురాలని చూడకుండా మాటలతో వేధించారు. ప్రాణం తీశారు.పైన ఫొటోలో కనిపిస్తున్న ఆ యువతి పేరు నిత్య. ఉండేది జగిత్యాల జిల్లా రూరల్ మండలం జాబితాపూర్‌లో. తన తోటి స్నేహితులు తనని ఎగతాళి చేశారని ఆత్మహత్య చేసుకుంది.. నిత్య హైదరాబాద్‌లోని ఓ ఉమెన్స్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న నిత్యాను తోటి స్నేహితురాళ్లే సూటిపోటి మాటలతో వేధించారు. స్నేహితుల ఎగతాళితో మనస్థాపం చెందిన నిత్య హైదరాబాద్ నుంచి తన స్వగ్రామమైన జాబితాపూర్‌కు వచ్చింది.ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అప్రమత్తమైన స్థానికులు జగిత్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. చదువుల కోసం హైదరాబాద్‌కు పంపిస్తే స్నేహితులే వేధించి చంపేశారంటూ నిత్య కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎవరో ఏదో అన్నారని క్షణికావేశంలో పెద్ద నిర్ణయం తీసుకున్న నిత్య తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిచ్చింది.

## సీఎం రేవంత్‌కు భాజపా లేఖ..

మొదటిపేజీ తరువాయి
వాగ్దానాలతో ఊదరగొట్టడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, అబద్ధాలను ఆవిష్కరించడం తప్ప మీరు చేసిందేమీ లేదు. రైతులు, యువకులు, మహిళలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ.. ఇలా అన్ని వర్గాలను వంచించిన చరిత్ర మీది. మీ వైఫల్యాలు రాస్తే రామాయణమంత.. వింటే భారతమంత. అలాంటి మీరు మా ముఖ్యమంత్రికి లేఖలు రాయడం విడ్డూరంగా ఉంది.గురువింద గింజ సామెతను గుర్తు చేసే విధంగా ఉన్న మీ లేఖ నవ్వు తెప్పిస్తోంది. తెలంగాణకు 11 ఏళ్లలో ఏం చేశారు? తెలంగాణకు కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వనప్పుడు మీరు కానీ, ఈ రాష్ట్రంలో ఉన్న 8 మంది భాజపా ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులు ఏం చేశారు? కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని 10లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని పదేళ్ల క్రితం ఇచ్చిన హామీ ఏమైంది? పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతలకి జాతీయ హోదా ఇవ్వకుండా మీనమేషాలు లెక్కిస్తోంది మీరు కాదా? పోలవరం ముంపుతో సంబంధం లేని 5 పంచాయతీలను ఏపీలో విలీనం చేసి భద్రాద్రి రామయ్య భూములును ఏపీకి అప్పనంగా అప్పగించింది మీరు కాదా?” అని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

## గిగ్ వర్కర్స్ కోసం త్వరలో కొత్త చట్టం తీసుకొస్తాం: మంత్రి వివేక్ వెంకటస్వామి

మొదటిపేజీ తరువాయి
రాహుల్ గాంధీ ఆలోచన అనుగుణంగా కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తానని అన్నారు. గిగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామని.. త్వరలో కొత్త చట్టం తీసుకువస్తామని అన్నారు వివేక్ వెంకటస్వామి. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పేదల సొంతింటి కల నెరవేరే విధంగా కృషి చేస్తానని అన్నారు మంత్రి వివేక్. కార్మికుల సమస్యలు పరిష్కారించేందుకు తమ ఇంటి తలుపులు ఎప్పుడు తెరిచి ఉంటాయని.. సింగరేణి ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. అక్రమ ఇసుక దందాలకు పాల్పడితే ఊరుకునేది లేదని అన్నారు మంత్రి వివేక్. ఇసుక దందాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చిస్తానని.. ఇసుక ద్వారా సుమారు రూ. 3 వేల కోట్ల పన్ను రావాల్సి ఉండగా కేవలం రూ. 600 కోట్ల రూపాయలు వస్తున్నాయని అన్నారు. రాష్ట్రానికి రావలసిన ఆదాయం ఎటు పోతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని తెప్పించి ప్రజలకు మేలు జరిగేలా చూస్తానని అన్నారు మంత్రి వివేక్.

సింగరేణి సంస్థను కాపాడడంతో పాటు పెన్షన్ ఇప్పించిన ఘనత కాకా వెంకటస్వామిదని అన్నారు. కాకా నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం,పేద ప్రజల కోసం ఆలోచించేవారని అన్నారు మంత్రి వివేక్. జైపూర్ పవర్ ప్లాంట్ తీసుకవచ్చారని.. గడ్డం కుటుంబం ఎల్లప్పుడూ ప్రజలకు సేవ చేస్తూ ఉంటుందని అన్నారు. కాకా కుటుంబంపై ఇంతటి ప్రేమను చూపిన ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. కాకా బాటలోనే ఎంపీ వంశీ కార్మికుల సమస్యలపై పార్లమెంట్ లో గళం విప్పటం జరిగిందని అన్నారు. కిరణ్ కుమార్ సీఎంగా ఉన్నపుడు తెలంగాణ కోసం మంత్రి పదవిని కూడా వదులుకున్నానని అన్నారు మంత్రి వివేక్. విశాఖ చారిటబుల్ ట్రస్ట్, వెంకటస్వామి ఫాండేషన్ ద్వారా నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తున్నామని.. ఎంపీగా ఉన్న సమయంలో రామగుండం ఎరువుల కర్మాగారం తిరిగి ఓపెన్ చేయడంతో పాటు రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేయడం జరిగిందని అన్నారు.

## రోజుకు 10 గంటలు పనిచేయొచ్చు!

మొదటిపేజీ తరువాయి
ఓవర్ టైమ్ పనిచేసే ఉద్యోగి ప్రత్యేక సందర్భాల్లో ఆరుగంటలకు మించి పనిచేయొద్దు. ఈ లెక్కన ప్రత్యేక సందర్భాల్లో ఒకరోజుకు గరిష్టంగా 12 గంటలు దాటి పనిచేసే అవకాశం లేదు.వారంలో 48 గంటల కంటే అధిక గంటలు పనిచేసినప్పుడు.. అందుకు తగిన అదనపు భత్యం చెల్లిస్తూనే.. ఒక త్రైమాసికంలో 144 పనిగంటలు దాటకూడదు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అతిక్రమిస్తే సదరు వాణిజ్య సంస్థకు ప్రభుత్వం నుంచి అందుతున్న మినహాయింపులు, రాయితీలను ఎలాంటి నోటీసు లేకుండానే రద్దు చేస్తుంది. ఈ మేరకు రాష్ట్ర కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు.

## వీకెండ్‌లో ఫన్ కోసం వెళితే లైఫ్ రిస్క్ - వికారాబాద్ జిల్లాలో ప్రాణాలు తీసే రిసార్ట్!



వికారాబాద్ మండలం.. సర్పన్ పల్లి ఇరిగేషన్ ప్రాజెక్ట్. కానీ.. అక్కడ సాగునీటి పనుల కంటే.. ఎక్స్ట్రాలే ఎక్కువగా జరుగుతుంటాయి. రిసార్ట్‌ల పేరుతో అమ్యూజ్‌మెంట్ దందాకు పాల్పడుతూ పర్యాటకుల నుంచి పైసావసూల్‌కు పాల్పడుతున్నారు.అక్కడో ప్రైవేట్ రిసార్ట్.. పేరు ‘ది వైల్డర్నెస్ క్యాంప్ సైట్’.. ముచ్చటైన కుటీరాల్లాంటి నిర్మాణాలు, ఏకాంతాలతో అలరించే గుడారాలు.. ఆహ్లాదకరమైన వాతావరణం రారమ్మని పిలుస్తుంటుంది. ఔటింగ్‌కు వచ్చినాళ్ల కోసం బోటింగ్ ఫెసిలిటీ కూడా ఉంది.సరదాగా గడుపుదామని వచ్చిన ఓ బీహార్ కుటుంబంలో పెను విషాదాన్ని నింపింది ఈ అందమైన రిసార్ట్. బోటింగ్ చేద్దామని ప్రాజెక్టులోకి వెళ్లి రేటా కుమారి, పూనమ్ సింగ్ అనే ఇద్దరు మహిళలు ప్రాణాలే పోగొట్టుకున్నారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ దుర్ఘటనతో ఆ రిసార్ట్ అసలు రూపాన్ని బైటపెట్టింది. టూరిజం, ఇరిగేషన్ శాఖల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఐదేళ్ల నుంచి అక్రమంగా బోటింగ్ నిర్వహిస్తున్నట్లు తేలింది. ఇక్కడ ఏదైనా జరగరానిది జరిగితే కనీస వైద్య సదుపాయాలు కూడా లేవు.ఉన్నతాధికారులకు పెద్దమొత్తంలో లంచాలిచ్చి ఇరిగేషన్ శాఖను మేనేజ్ చేసి ఇక్కడ రిసార్ట్ నడుపుతూ.. కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ జరిగే అక్రమ బోటింగ్‌పై మీడియాలో వరుస కథనాలు వచ్చినా.. ఇరిగేషన్ అధికారుల్లో చలనం లేదు. తూతూ మంత్రంగా సోదాలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. కొన్ని రోజుల పాటు బోటింగ్ ఫెసిలిటీని నిలిపివేసినా.. మళ్లీ యధావిధిగా కొనసాగిస్తున్నారు. అసలే వర్షాకాలం.. ఆపై ఈదురుగాలులు.. కాలం చెల్లిన ఎలక్ట్రిక్ బోట్లలో లాహిరి లాహిరి.. ఇంకేముంది? మునిగిపోవుడే. ప్రాణాంతకంగా మారుతున్న ఈ పడవ ప్రయాణంపై ఓ నజర్ వేసేదెవరు? అనుమతుల్లేకుండా నడుస్తున్న అక్రమ రిసార్ట్ అంతు చూసేదెవరు? అని ప్రశ్నిస్తున్నారు స్థానికులు.

## చరిత్ర సృష్టించిన టీమిండియా..! ఇంగ్లాండ్‌పై రెండో టెస్టులో అపూర్వ విజయం

మొదటిపేజీ తరువాయి
బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. ఏకంగా 336 పరుగుల భారీ తేడాతో ఈ మ్యాచ్ గెలిచింది గిల్ సేన. లీడ్స్ లో జరిగిన తొలి టెస్టులో ఓటమికి ఈ విజయంతో బదులుతీర్చుకుంది. మొత్తం ఐదు టెస్టుల సిరీస్‌లో ప్రస్తుతం ఇరు జట్లు 1-1తో సమంగా ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అలాగే టీమిండియా బౌలర్లలో తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ 6, రెండో ఇన్నింగ్స్‌లో ఆకాశ్ దీప్ 6 వికెట్లతో సత్తా చాటారు. 600లకు పైగా పరుగుల భారీ టార్గెట్‌తో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లాండ్‌ను భారత బౌలర్లు కేవలం 271 పరుగులకే ఆలౌట్ చేశారు.

జూలై 2న ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ తీసుకున్నాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ ఏకంగా 587 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ గిల్ 387 బంతుల్లో 30 ఫోర్లు, 3 సిక్సులతో 269 పరుగులు సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. అలాగే ఓపెనర్ యశస్వి జైస్వాల్ 87, రవీంద్ర జడేజా 89, వాషింగ్టన్ సుందర్ 42 పరుగులతో టీమిండియాకు పెద్ద స్కోర్ అందించడంతో కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత టీమిండియా ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో గట్టి జవాబే ఇచ్చింది. కేవలం 84 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన తర్వాత కూడా హ్యారీ బ్రూక్(158), జేమీ స్మిత్ (184) పోరాటంతో 407 పరుగులు చేసి ఆలౌట్ అయింది. టీమిండియా బౌలర్లలో సిరాజ్ బుమ్రా లేని లేటు పూడుస్తూ 6 వికెట్లతో చెలరేగిపోయాడు. అలాగే ఆకాశ్ దీప్ సైతం 4 వికెట్లు పడగొట్టాడు.

ఇక మంచి లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన టీమిండియా ఈసారి కూడా భారీ స్కోర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో కదం తొక్కిన గిల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ భారీ ఇన్నింగ్స్ ఆడాడు. 162 బంతుల్లో 13 ఫోర్లు, 8 సిక్సులతో 161 పరుగులు చేసి మళ్లీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కేఎల్ రాహుల్ 55, రిషభ్ పంత్ 65, జడేజా 69 పరుగులతో రాణించారు. మొత్తంగా ఇంగ్లాండ్‌కు టీమిండియా 600 ప్లస్ టార్గెట్ ఇచ్చింది. ఇక భారీ టార్గెట్‌తో మరిలోకి దిగిన ఇంగ్లాండ్‌కు ఆకాశ్ దీప్ చుక్కలు చూపించాడు. ఏ దశలోనూ ఇంగ్లాండ్ లక్ష్యం దిశగా సాగలేదు. ఈ సారి కూడా జేమీ స్మిత్ 88 పరుగులతో పోరాటం చేసినా.. టీమిండియా బౌలర్ల ముందు నిలబడలేకపోయాడు. ఇంగ్లాండ్‌కు ఓటమిని తప్పించలేకపోయాడు. స్మిత్ తప్ప మిగతా బ్యాటర్లు ఎవరూ కూడా పెద్దగా రాణించలేదు.

ఆకాశ్ దీప్ అద్భుతమైన బౌలింగ్ ముందు వాళ్లు తలొంచారు. మొత్తంగా 68.1 ఓవర్లలో ఇంగ్లాండ్ 271 పరుగులు చేసి ఆలౌట్ అయింది. టీమిండియా ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. ఏకంగా 336 పరుగుల భారీ తేడాతో ఈ విజయం సాధించింది. టీమిండియా బౌలర్లలో ఆకాశ్ దీప్ 6 వికెట్లు, సిరాజ్, ప్రసిద్ కృష్ణ, జడేజా, సుందర్ తలో వికెట్ తీసుకున్నారు. ఈ విజయంతో కొత్త కెప్టెన్‌కు తొలి విజయం దక్కింది.

# కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తున్న కేంద్ర మోడీ సర్కార్

**- ప్రజా సమస్యలను గాలికొదిలి అధికార,విపక్ష నేతల సవాళ్లు హాస్యాస్పదం**

**- ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కండి**

**- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 06 :**
కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా సీపీఐ మహాసభల సందర్భంగా కురవి మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్ హాల్ లో ప్రతినిధుల సభకు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మోడీ పాలనలో ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తూ ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో ముందుకు సాగుతున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ ను పరుస్తూ లక్షల కోట్ల రూపాయలను రాయితీలు ఇస్తూ ప్రజల సంక్షేమం మరిచి ప్రజాస్వామ్య గొంతును, ప్రజల గొంతుకను అణిచివేస్తూ కేంద్రం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తుంగలో తొక్కుతున్నదన్నారు. రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను



అణిచివేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను మంటగలుపుతున్నారని, కేంద్రంలో జాతీయవాదం పేరుతో హిందుత్వ ఏజెండాతో ముస్లిం, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులపై విషం కక్కుతూ ప్రశ్నించే గొంతుకను నొక్కుతున్నారని అన్నారు. నిరుద్యోగం, ఆకలి, దారిద్రం నిరంతరం పెరుగుతూ పేదలకు విద్య, వైద్యం అందక ప్రజలు ఆందోళన కు గురవుతున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు.ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ఆదివాసీలను హత్య చేస్తున్నదని అన్నారు.మావోయిస్టులపై చేపట్టిన మారణకాండను నిలిపివేసి తక్షణమే మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఫాసిస్ట్ చర్యలను మేధావులు, విద్యార్థులు ఐక్యంగా వ్యతిరేకించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను



అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలను గాలికి వదిలి అధికార, విపక్ష పార్టీలు సవాళ్లు, ప్రతి సవాళు విసురుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలపై వారికి చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. నిరంతరం పేదల, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడే కమ్యూనిస్టులుగా తాము ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని చెప్పారు. రానున్న రోజులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలుచేయాలని పోరాటాలకు సిద్దం కావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, తురక రమేష్, వెలుగు శ్రావణ్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. తొలుత మహాసభల ప్రాంగణంలో సీనియర్ నాయకులు దూదికట్ల సారయ్య అరుణ పతాకాన్ని ఆవిష్కరించగా, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు నల్లు సుధాకర్ రెడ్డి స్వాగత ఉపన్యాసం గావించారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్ రావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి అజయ్,రాష్ట్ర సమితి సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి, నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, రేశపల్లి నవీన్, కనకం రాజన్న, నెల్లూరి నాగేశ్వర్ రావు, పాండురంగ చారి, వరిపల్లి వెంకన్న, జంపాల వెంకన్న,చొప్పరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కార్మికశాఖ జీవో 282 అమలును నిలిపివేయాలి

**- టీయూసిఐ డిమాండ్**

**నిజామాబాద్ ప్రతినిది (మన వెలుగు) జులై 06**
ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసిఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవన్,కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.నరేందర్,ఎం.సుధాకర్ లు మాట్లాడుతూ.జులై 5న రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ షాప్స్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టంలో సవరణ పేరుతో జీవో నెం:282 ను విడుదల చేసిందన్నారు. వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులతో,కార్మికులతో రోజుకు 10గంటలు పనిచేయించుకోవచ్చని, వారానికి 48 గంటలు మించకూడదని,అది దాటితే ఓటి చెల్లించాలని ఈ జీవోలో పేర్కొన్నదన్నారు.అయితే ఈ జీవోలో అస్పష్టత,సందేహాలు ఉన్నాయన్నారు.ఈ జీవోలో ఉన్న అస్పష్టతలపై కార్మిక శాఖ మరింత వివరణను,స్పష్టతను ఇవ్వాలని టియుసిఐ డిమాండ్ చేస్తున్నామన్నారు.కార్మిక శాఖ కార్యాలయంలో రాష్ట్రంలో ఉన్న వ్యాపార వాణిజ్య సంస్థలు ఎన్ని? కార్మిక శాఖలో వాటి నమోదు జరిగిందా? అందులో పనిచేస్తున్న




సిబ్బందికి చెల్లిస్తున్న వేతనాలు ఎంత? ప్రతిరోజు పనిగంటలు రికార్డు అవుతుందా? ఓటి చెల్లిస్తున్నారా? ఈ వివరాలు కార్మిక శాఖ వద్ద ఉన్నాయా? అని ప్రశ్నించారు.ఇప్పటికే అనధికారికంగా 10 గంటల చొప్పున పనిచేయిస్తున్న యాజమాన్యాల దగ్గర కార్మికులకు ఓటి ఇప్పించే నిర్దిష్టమైన చర్యలు ఉన్నాయా? మల్టీ నేషనల్, అతి పెద్ద షాపింగ్ మాల్స్ లో సెక్యూరిటీ గార్డులు, సేల్స్ పర్సన్స్, ఇతర సిబ్బంది రోజంతా నిలబడే పనిచేస్తున్నారు. వీరి శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదు. కార్మికులకు అందుతున్న సౌకర్యాలు వేతనాలపై కార్మిక శాఖ వద్ద నివేదికలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. జీవోలో పనిగంటలను పెంచుతూ మాత్రమే పేర్కొన్నారు. కానీ, కార్మికుల ఉద్యోగ భద్రత, ఆరోగ్య, జీవన భద్రత, తగిన వేతనాలపై స్పష్టత లేదన్నారు. జీవోలో వారి కనీస వేతనం ఎంతో ప్రకటించాలన్నారు. అస్పష్టమైన జీవోవల్ల వాణిజ్య సంస్థలు, యాజమాన్యాలు లాభం పొందుతాయి కానీ, అందులో పని చేసే కార్మికులకు ప్రయోజనం లేదన్నారు. పైగా మరింత శ్రమదోపిడికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు.కాబట్టి కార్మిక శాఖ జీవోను అభయన్స్ లో పెట్టి కార్మిక సంఘాలతో చర్చ జరపాలని, కార్మిక సంఘాల సందేహాలపై వివరణ ఇచ్చిన తర్వాతే జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రెస్ మీట్ తో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, జిల్లా నాయకులు పి.సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# ఏక్ దేశ్ మే దో విధాన్,దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహి ఛాలెంగే

**- అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 06**
శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు శ్యామ ప్రసాద్ ముఖర్జీ గొప్ప న్యాయవాది మరియు విద్యావేత్త అని 33 ఏళ్ల వయస్సులో కలకత్త యూనివర్సిటీ వీసీ గా పనిచేసారన్నారు.అఖిల భారతీయ హిందూ మహాసభల అధ్యక్షులుగా సేవాలాందించి, భారతదేశ మొదటి వాణిజ్యం %ఢ% పరిశ్రమల శాఖ మంత్రిగా దేశానికి సేవలందించారని అన్నారు.దేశ సమగ్రత, ఐక్యత కోసం హిందువులలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించడం ద్వారా జాతీయ పునరనిర్మాణం జరుగుతుందనే లక్ష్యంతో



జనసంఘ్ స్థాపించడం జరిగిందన్నారు.జాతి ఐక్యతను ముప్పుగా భావించే ఆర్టికల్ 370ని ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకంచారని అన్నారు.ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహి ఛాలెంగే (ఒకే దేశానికి రెండు రాజ్యాంగలు, ఇద్దరు ప్రధానులు మరియు రెండు జాతీయ చిహ్నాలు ఉండకూడదు )అన్నారు నరేంద్రమోదీ ముఖర్జీ ఆశయాలకు, ఆకాంక్షాలకు అనుగుణంగా 370 ఆర్టికల్ రద్దుచేసి కాశ్మీర్ ను సుందరికరణ చేయడాన్ని మనం చూస్తున్నాం అని పేర్కొన్నారు.పహల్ గాం ఘటనకు దిటుగా ఆపరేషన్ సింధూర్ తో పాకిస్థాన్ కు తగిన బుద్ది చెప్పడం జరిగిందన్నారు, దేశ భద్రత, సమగ్రత,అభివృద్దె లక్యంగా ముఖర్జీని ఆదర్శంగా తీసుకొని కేంద్రప్రభుత్వం పని చేయడం జరుగుతుందాన్నారు.ముఖర్జీ పార్టీ కోసం అహర్నిశలు శ్రామిస్తూ తన జీవితాన్నే అంకితం చేసి అతని మరణం కూడా నిర్భంధం లోనే ఒక మిస్ట్రీగా మిగిలిపోయిందని ఆ మహనీయుని త్యాగానికి గుర్తుగా బలిదాన్ దివస్ జరుపుకుంటున్నాం అన్నారు.ముఖర్జీ ఆశయ లక్ష్య సాధనకు ప్రతి కార్యకర్త పని చేయాలనీ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శులు న్యాలం రాజు, పోతంకర్ లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్,బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తీక్, కస్తూరి కృష్ణ, నారాయణ యాదవ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 8న మహబూబాబాద్ నియోజక వర్గంలో జరిగే మహాసభను విజయవంతం చేయగలరు

**- మహబూబాబాద్ శాసన సభ్యులు డా భూక్యా మురళీ నాయక్**

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 06 :**
భారత దేశం ఉప ప్రధాని స్వతంత్ర సమర యోధుడు సమాజ నిర్మాత బాబు జగ్జీవన్ రామ్ 39 వ వర్ధంతిని సందర్భంగా మహబూ బాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలోనీ మదర్ థెరిస్సా సెంటర్లో వున్న విగ్రహానికి పూలమాలవేసి నివాళు



లర్పించారు మహబూబా బాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా మురళీ నాయక్ గ మాట్లాడుతూ..గాంధీజీ చేత అమూల్య భారత రత్నగా పిలువబడే బాబు జగ్జీవన్ రామ్ సామాజిక వివక్ష, అసమానతలు లేని ఒక స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య, సమాజ నిర్మాణం కోసం తన జీవితాంతం కృషిచేశారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం వచ్చాక మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానమంత్రిగా పనిచేసి మచ్చలేని నాయకుడిగా ఆదర్శ జీవితం గడిపారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కరణోద్యమనేత బాబు జగ్జీవన్ రామ్ వర్థంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. మారుమూల బీహార్ రాష్ట్రంలో వారు 1932 వ సంవత్సరంలో దళిత గిరిజన కు జరుగుతున్న అంటారని తన్ననీ చూసి వారు స్థాయిలో నుండి దళిత గిరిజన హక్కుల కోసం బాబు జగ్జీవన్ రావు గారు ఉద్యమాన్ని తీసుకువచ్చారు.దళితులు అని చెప్పుకునే స్థాయి నుండి వారి భారత దేశానికి రక్షణ శాఖా మంత్రి గా భారత దేశ ఉప ప్రధానిగా సేవలు అందించిన వ్యక్తి బాబు జగ్జీవన్ రావు అన్నారుమన కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీ న వర్గాలకు అండగా ఉంటూ



సీలింగ్ యాక్ట్ పెట్టీ దళితులకు 5 ఎకరాల భూమి ఇచ్చిన ప్రభుత్వం అంటే కాంగ్రెస్ పార్టీ అని దళితుల లో కొన్ని ఉప కులాలుగా విభజించి ప్రతి ఒక్కరికి సమానంగా న్యాయం జరగాలని చట్టబద్ధంగా చట్టాలు తీసుకొచ్చి వారికి ఉన్నత స్థాయిలో ఉండేలా వారికి అవకాశాలు ఇచ్చిన పార్టీ అంటే ఆది కాంగ్రెస్ పార్టీ అదేవిధంగా కులగణన ఎస్సీ రిజర్వేషన్ చేసిన పార్టీ అంటే ఆది కాంగ్రెస్ పార్టీ అని ఈ సందర్భంగా తెలియజేశారు మానుకోట నియోజకవర్గంలో జులై 8న జరిగే మహా సభను విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు,వివిధ సంఘాల నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## బాలిక హంతకులను కఠినంగా శిక్షించాలి

**- కొమిరెడ్డి కరంచంద్**

**మెట్ పల్లి (మన వెలుగు) జులై 06 :**



కోరుట్ల పట్టణానికి చెందిన ఐదేళ్ల హితిక్ష అనే చిన్నారిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని టిపిసిసి సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్, విజయ్ ఆజాద్ లు ఒక ప్రకటనలో కోరారు. జరిగిన సంఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కరంచంద్, విజయ్ ఆజాద్ లు.. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులైన ఆకుల రాము కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదివారం హైదరాబాదు నుండి చరవాణి ద్వారా మెట్పల్లి లోని స్థానిక విలేకరులతో మాట్లాడిన వారు.. సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన ఈ ఘటన అత్యంత హేయమైనదని, సమాజం ఎటువైపు వెళ్తుందో చిన్నారి పాశావిక హత్య సమాజంలో నేర ప్రవృత్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

**- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు- బొల్లం జ్యోతి**

**- జాతీయ ఉపాధ్యక్షురాలు నమిల భాగ్యమ్మ**

**హైదరాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 06 :**
ఈరోజు హైదరాబాదులోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ మహిళా నాయకులు మరియు వివిధ జిల్లాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం



ఏర్పాటు చేసిన రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లం జ్యోతి, అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రేపు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరగబోయే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సభను రాష్ట్రంలో నలుమూలల ప్రతి గ్రామంలో మండలంలో జిల్లా కేంద్రాలలో నాయకులు మరియు కుల బాంధవులందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయలని ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏ లక్ష్యాలు ఏ ఆశయ సాధన కోసం ఏర్పాటయిందో వాటిని నాయకులు కార్యకర్తలు మరల ఒకసారి గుర్తు చేసుకోవాలని ఎమ్మార్పీఎస్ ద్వారానే వర్గీకరణ సాధించుకున్నాం కాబట్టి సాధించుకున్న రిజర్వేషన్ అమలుకై పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి మరియు వివిధ జిల్లాల మండలాల ఎమ్మార్పీఎస్ మహిళా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# కర్మేంద్రియాల్ని, జ్ఞానేంద్రియాల్ని అదుపులో ఉంచుకోవాలి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 06 :**
వేల్పూర్ రెవెన్యూ శివారులో గల గోవిందసాయి (సాయి బాబా) దేవాలయం ప్రాంగణంలో సామూహిక ఆధ్యాత్మిక సప్త భజనలో భాగంగా 4వ రోజు



ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం శాస్త్రబద్ధంగా గురుపాదుకాపూజ నిర్వహించారు. నిరవధికంగా సామూహిక భజనలు చేస్తున్నారు. వీణను ధరించి గురునామాన్ని జపిస్తున్నారు. ఏకాదశి పండుగను ఉద్దేశించి ప్రవచనకర్త శ్రీ రాఘవేంద్ర స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రాఘవేంద్ర స్వామి మాట్లాడుతూ. విష్ణు విగ్రహాన్ని పూజించండి.విష్ణు



సహస్రనామ పారాయణం చేసి “ఓం నమో భగవతే వాసుదేవాయ” అనే మంత్రాన్ని జపించండి. పండ్లు, పూలు,స్వీట్లు, పంచామృతాన్ని అందించండి. పేదలకు, బ్రాహ్మణులకు దానాలు చేయండి. ఏకాదశి ఉపవాసం నుండి సాత్విక ఆహారం తీసుకోండి. ఏకాదశి రోజున సానుకూల ఆలోచనలను మనస్సులో ఉంచుకుని ఆధ్యాత్మిక కార్యములో నిమగ్నులై ఉండాలి. ఏకాదశి ప్రజలలో ఉండే చైతన్యానికి ప్రతీక. ఏకాదశి అంటే 11. అంటే 5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, మనస్సు కలిపి మొత్తం 11. వీటిని మనిషి తన ఆధీనంలోకి తీసుకువచ్చి వాటి నన్నిటిని ఒకటిగా చేసి అప్పుడు దేవునికి నివేదించాలి. దీనివలన మనిషికి సహజంగా అలవాడే బద్ధకం దూరమవుతుందని, రోగాలు దరిచేరకుండా ఉండి, ఇంద్రియ నిగ్రహం పెరుగుతుంది అని శ్రీ రాఘవేంద్ర స్వామి అన్నారు.

## విఠలేశ్వర మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 06 :**
ఇందూర్ నగరంలోని పవిత్ర తొలి ఏకాదశి సందర్భంగా అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ నాందేవ్వాడ విఠలేశ్వర్ ఆలయంలో



భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా విఠల రుక్మిణీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి,భక్తులతో కలిసి హారతులు సమర్పించారు.ఆలయ పూజారుల చేతుల మీదుగా ఆయనకు పూర్ణకుంభ స్వాగతం నిర్వహించి ఆలయ కమిటీతో ఘన స్వాగతం పలకడం జరిగింది.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు ఆషాడ మాసంలో వచ్చే తొలి ఏకాదశి ఈమొదటి పండుగ హిందువులకు ప్రత్యేకమైందని అన్నారు.విష్ణు మూర్తి కృపతో ప్రజలందరు, ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతోఉండాలని ముఖ్యంగా రైతులకు తొలకరి వానలు కురిసే ఈ సమయంలో అనువైన వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.
ఈ పూజా కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎర్రం సుదీర్, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొనడం జరిగింది.

# జర్నలిస్టులా పోరాట పటిమ ప్రశంసనీయం

- కొల్లాపూర్ తో పాటు రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇండ్ల కోసం మరోసారి సీఎం దృష్టికి తీసుకు వళ్తాం
- మీ దీక్షలు రాష్ట్రవ్యాప్తంగా, ఇంటెలిజెన్స్ ద్వారా ప్రభుత్వ దృష్టికి వెళ్ళింది
- టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బసవ పున్నయ్య






కొల్లాపూర్ లో రెండు వారాలుగా పోరాట పటిమ ప్రదర్శిస్తూ ఇండ్ల స్థలాల కోసం ఉద్యమిస్తున్నారు మీకు అండగా టీ డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతు సంఘీభావం తెలియజేస్తున్నామన్నారు ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఇండ్లు ఇండ్ల స్థలాల కోసం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ జిల్లా అధ్యక్షులు రామచంద్రం తాలూకా కన్వీనర్ జలకం మద్దిలేటి జిల్లా నాయకులు మల్లికార్జున సాగర్ సీనియర్ జర్నలిస్టులు బి కురుమయ్య కారంగి గోవిందు కళ్లెపు భాను ప్రకాష్ రామకృష్ణ కేశవులు నరేష్ రాము మల్లేష్ దీక్షలు ప్రారంభించారు ఈ దీక్షలకు సంఘీభావంగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బసవ పున్నయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్ మద్దతు ప్రకటించారు ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బసవ పున్నయ్య మాట్లాడుతూజర్నలిస్టుల సమస్య గత 40 ఏళ్ల నుండి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణలో ఈ సమస్య పరిష్కారం కోసం చిట్టచివరి వరకు ఉద్యమాలు చేపట్టిన ఘనత టిడబ్ల్యూజేఎఫ్ సంఘానిదేనన్నారు 35 సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ లో 10 ఏళ్ల నుండి తెలంగాణలో జర్నలిస్టుల సమస్యల పట్ల పరిణామాలు,ఎదుర్కొంటుందన్నారురాష్ట్రంలో జిల్లాలలో నియోజకవర్గాలలో మండలాలలో మండల కేంద్రాలలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తాం అని చెప్పి గతంలో ఉన్న ప్రభుత్వాలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడాప్రకటించాయన్నారు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్న కొంత మిగతా వాటిపై న్యాయపరమైన అంశాలు అడ్డంకిగా ఉన్నందున వాటిని చేదించే విషయంలో ఈ ప్రభుత్వం ఉందన్నారు అప్పటివరకు చూస్తూ కూర్చోవాల్సిన అవసరం లేదన్నారు మన ఆందోళన పోరాటాల ద్వారా ప్రజా ప్రతినిధులకు స్థానిక అధికారులకు రాష్ట్ర అధికారులకు దృష్టికి తీసుకుపోవాల్సిన అవసరం ఉన్నదన్నారు ఉమ్మడి రాష్ట్రంలో 11 జీవోలలో ఉన్న వాటిలో 31, 32, 33, జీవోల ఆధారంగా ఇండ్ల స్థలాలు ఇవ్వమంటున్నాం నేను ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నకార్పొరేట్లకు పెట్టుబడిదారులకు లక్షల ఎకరాల భూము లు బ్యాంకు రుణాలు వస్తున్నారని కొన్ని రోజుల క్రితం 15 లక్షల కోట్ల రూపాయలు అంబానీ ఆదాని మాల్యాలకు ఉచితంగా దానం చేస్తున్నారన్నారు కానీ ఒక్క పేదవాడు 150, 70 గజాల స్థలం తల దాచుకోవడానికి ఇమ్మంటే మాత్రం నాయకులకు చేతులు రావడం లేదన్నారు లక్షల కోట్లు సంపాదించుకోవడానికి వారు స్థలాలు అడుగుతున్నారు తలదాచుకోవడానికి మనం కొంత భూమిని అడుగుతున్నాం ఈ విషయంలో ప్రభుత్వంతోరాజీ పడేది లేదని తెలిపారు ముఖ్యమంత్రి దృష్టికి పలుమార్లు ఈ విషయాలను తెలియజేయమన్నారు కొల్లాపూర్ నాగర్ కర్నూల్ తో సహా రాష్ట్రంలోని జిల్లాలు మండలాలు నియోజకవర్గ కేంద్రాల లో జర్నలిస్టుల న్యాయమైన ఇండ్ల స్థలాల విషయంపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి మరో మారు తీసుకువెళ్తామన్నారు జర్నలిస్టుల సమస్యల కోసం తెలంగాణ న్యాయశాఖ ఇప్పటికే కోర్టులో రివ్యూ పిటిషన్ వేసిందని టిడబ్ల్యూజేఎఫ్ సంఘం ఆధ్వర్యంలో కోర్టులో న్యాయ పరాటాలు చేస్తున్నాయన్నారుఅక్రిడేషన్ కార్డులు హెల్త్ కార్డుల విషయంలో సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాసులు దృష్టి కూడా తీసుకువెళ్లేమని రైల్వే పాసుల కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని చాలా సందర్భాల్లో కలిసి మెమొరండాలు ఇచ్చామని జర్నలిస్టుల పక్షాన ధర్నాలు చేపట్టామని నిరంతర పోరాటాలు చేస్తూ వస్తున్నామని పోరాటాలు చేయక తప్పదని పోరాటాలతోనే సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేద్దామని వారు తెలిపారుటిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ రాజశేఖర్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్ లో మాట్లాడుతూ జర్నలిస్టులో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని 12 రోజులుగా దీక్షలు చేయడం జర్నలిస్టులు ఐక్యతకు నిదర్శనం అన్నారు కొల్లాపూర్ దీక్షలు చేస్తున్న జర్నలిస్టులు అంశం గురించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లిందని త్వరలో జర్నలిస్టులకు మేలు జరుగుతుందని తెలిపారు పోరాటాల ద్వారానే పరిష్కారం లభిస్తుంది అన్నారు ఇళ్ల స్థలాల మంజూరుకై కొల్లాపూర్ జర్నలిస్టులు టి డబ్ల్యూ జేఎఫ్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలను స్ఫూర్తిగా తీసుకొని కార్యనిర్వాహన రూపొందించుకొని రాష్ట్రంలో కూడా ఉద్యమించేందుకు మేము కూడాసిద్ధమవుతున్నామన్నారుప్రభుత్వానికి ప్రజలకు వారధులు జర్నలిస్టులే,గౌడ సంఘం జిల్లా నాయకులు చందన్ గౌడ్ ప్రముఖ న్యాయవాది నిరంజన్ మాదిగల ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షులు కారంగి నరసింహ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ డివిజన్ ఉపాధ్యక్షులు స్వామి ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి ఏదుల రాముడు జిల్లా నాయకులు పుట్టపాక రాము పట్టణ అధ్యక్షులు సంకటి కురుమయ్య ప్రధాన కార్యదర్శి బాలయ్య ఆదివాసి సాలిడ్ సంస్థ ప్రతినిధి మహేష్ లు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పట్టణ జర్నలిస్టులు చేస్తున్న సేవలను గుర్తింపుగా కోరే చిన్న కోరిక ఇండ్లు ఇండ్ల స్థలాల పంపిణీ విషయంలో పాలకులు చేస్తున్న నిర్లక్ష్యం దారుణమని వారు అన్నారు సమాజంలో జరుగుతున్నటువంటి సమస్యలను పాలకుల దృష్టికి తీసుకు వెళ్లడంలో కానీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడంలో గాని జర్నలిస్టులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారని అట్టివారికి ఇండస్థలాలు మంజూరు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం తగదాన్ని వారు అన్నారు నిస్వార్థంగా ప్రజలకు ప్రభుత్వానికి సేవలు అందిస్తున్న జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం వారిని దీక్షలా దాకా తీసుకువచ్చి రోడ్డుపై ఉంచడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని వారు అన్నారు జర్నలిస్టులు ఎన్నో ప్రయాసలకు లోన్అవుతూ చాలా దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వర్తింపజేసి నట్లే ప్రభుత్వానికి ప్రజలకు సేవలు చేస్తున్న జర్నలిస్టులకు ఇండ్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



**బోథ్ (మన వెలుగు) జూలై 06 :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రం లోని స్థానిక సిరికొండ బస్టాండ్ సమీపంలో బాబు జగ్జీవన్ రామ్ ఇచ్చోడ మండల గౌరవ అధ్యక్షులు మచ్చ వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకొని బాబు జగ్జీవన్ రామ్ యొక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రావ్ కమిటీ సభ్యులు నగేష్ సాయిరాం అజయ్ నందు లక్ష్మణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ భూపతి కాశయ్య జన్మదిన వేడుకలు



**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 06 :** తెలంగాణ ఎక్స్ ప్రెస్ దిన పత్రిక డోర్నకల్ ఆర్సీ,సీనియర్ పాత్రికేయులు భూపతి కాశయ్య గౌడ్ జన్మదిన వేడుకలు నరసింహులు పేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు,వేడుకలకు నరసింహులు పేట ఎస్సై మాలోతు సురేష్ మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జినుకల రమేష్ మరియు పాత్రికేయులు పాల్గొన్నారు అనంతరం కేక్ కటింగ్ చేసారు.

# పసిపాప హత్యపై న్యాయవాది ఆకుల మానస ఖండన



**మెట్ పల్లి (మన వెలుగు) జులై 06 :** కోరుట్ల పట్టణంలో అన్యం పుణ్యం తెలియని ఐదేళ్ల పసిపాప ఆకుల హితీక్షను హత్య చేసిన ఘటనపై మెట్ పల్లి కి చెందిన యువ న్యాయవాది ఆకుల మానస తీవ్రంగా స్పందించారు.ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, చిన్నారిపై పాశవికంగా దాడిచేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అమానుష సంఘటనలు మళ్లీ జరగకుండా పోలీసులు శాశ్వత చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం, బాధిత కుటుంబ సభ్యులైన ఆకుల రాము కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# ప్రైవేటు వాహనాల జోరు.. ప్రయాణికుల బేజార్

- హోటల్ ముందు వాహనాలతో ట్రాఫిక్ సమస్య
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు ప్రజలు
- అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం శూన్యం
- ఆర్టీసీ ఎండికి ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధం



కొత్తగూడెం ఆర్టిసి బస్టాండ్ లోకి ఇష్టారాజ్యంగా ప్రైవేటు వాహనాలు ప్రవేశించి పార్కింగ్ చేయడం వల్ల ప్రయాణికులు బేజార్ అవుతున్నారు. బస్టాండ్ కాంప్లెక్స్ లో ఉన్న హోటల్లో టిఫిన్లు భోజనాలు చేసేందుకు కొందరు ప్రైవేటు వాహనాలను ఆర్టిసి ఆవరణలోకి తీసుకువచ్చి హోటల్ ముందు పార్కింగ్ చేసి ఉంచడం వల్ల అసౌకర్యం ఏర్పడుతుంది. ప్రవేట్ వాహనాలతో ఆర్టీసీ బస్సులను ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలా అర్థం కాక డ్రైవర్లు సతమతమవుతున్నారు. గతంలో హోటల్ ముందు నో పార్కింగ్ బోర్డులు ఉండగా వీటిని తొలగించి ఉండడంవల్ల మళ్లీ ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేసి ఉంచడం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. హోటల్ ముందున్న గేటును మూసివేసినట్లయితే ప్రైవేట్ వాసన వాహనాలు లోపలికి వచ్చే అవకాశం ఉండదని ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.అడపాదప ఆర్టీసీ సిబ్బంది ప్రైవేట్ వాహనాలు రాకుండా పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో సక్సెస్ కనబడడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ ఆవరణలోకి ప్రవేటు వాహనాలు రాకుండా ఉండాలంటే ప్రధాన హోటల్ వెనుక భాగంలో ఉన్న గేటు మూసివేస్తే సమస్య పరిష్కారం అవుతుందని ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో ఆర్టిసి ఎండికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని కొందరు ప్రజాసంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

# బీఆర్ఎస్ సోషల్ మీడియా వార్తపై దిగొచ్చిన ఆర్టీసీ

- ఆదిలాబాద్ నుంచి గుడిహత్నూర్ వరకు 50 ఉన్న టికెట్ ను తగ్గిస్తూ 40 చేసిన వైనం
- ప్రయాణికులకు తగ్గిన భారం
- ప్రశ్నించిన సోషల్ మీడియా నాయకుడు మజర్ కి అభినందనలు తెలిపిన ప్రయాణికులు




**బోథ్ (మన వెలుగు) జులై 06 :** ఆదిలాబాద్ నుంచి గుడిహత్నూర్ వరకు ఆర్టీసీ ఏకంగా రూ. 20 పెంచి ప్రయాణికుల వద్ద రూ. 50 వసూలు చేయడాన్ని బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు మజర్ ఖండిస్తూ ఈనెల 3వ తేదీ గురువారం మీడియా ముందు మహాలక్ష్మి టికెట్ మగవారి దగ్గర వసూలు అనే శీర్షికతో ప్రశ్నించగా అనేక మంది ప్రయాణికులు ప్రశ్నించడాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మీడియా నాయకులు మజర్ చేసిన ప్రకటనకు దిగొచ్చిన ఆర్టీసీ నేడు 50 ఉన్న టికెట్లను రూ. 10 తగ్గించి 40 కి చేసింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు మాట్లాడుతూ ప్రజల కోసం ఎల్లప్పుడూ ప్రశ్నిస్తామని ప్రజలను ఇబ్బందులు పెడితే సహించమని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేసేంత వరకు వదిలిపెట్టబోమని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఇష్టం వచ్చిన రీతిలో చార్జీలు పెంచడం అమయకులపై భారాన్ని మోపడం మానుకోవలన్నారు.

# ములుగు జిల్లా టిఆర్ఎస్వి నాయకులకు నమస్కారం



రేపు అనగా సోమవారం రోజున ములుగు జిల్లా కేంద్రంలో మహాధర్నకు కదిలి వెళ్లాంకాంగ్రెస్ పార్టీ చేస్తున్న అవినీతి అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజా పక్షాన చేసే మహాధర్నా ప్రజల పక్షాన అడుగుతూ ఉంటే కేసులు పెడతారా ప్రజల పక్షాన పోరాడుదాం ఎన్ని కేసులు పెట్టినా ప్రజల పక్షాన పోరాడుతాం జర్నలిస్టులపై దాడులను వ్యతిరేకంగా ప్రజా పక్షాన అడిగితే అణిచివేతకై వ్యతిరేకంగా ములుగు జిల్లాలో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అవినీతి అక్రమాలు అది అధికారం దుర్వినియోగాన్ని ప్రశ్నిస్తున్న వారిని అణచివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం ములుగు నియోజకవర్గంలో ఇప్పటికి ముగ్గురు బలిదానం ఎక్కడ చూసినా అరాచకం అవినీతి దండాలు సామాన్య గిరిజన పై పోలీసులు దాడులు ఫారెస్ట్ అధికారులు దాడులు ఇదేనా ప్రజాస్వామ్యం దాడులు నిజాన్ని నిర్భయంగా రాస్తున్న ఎలక్ట్రిక్ మీడియా సోషల్ మీడియా వీళ్ళపై అక్రమ కేసులు ప్రణాహిస్తున్న దీని తీవ్రంగా ఖండిస్తున్నానుసోమవారం రోజున ములుగు జిల్లా ప్రజా నిరసన కార్యక్రమం యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయగలరుదుర్గం రాజ్ కుమార్ %దీ=ాాం% ములుగు జిల్లా నాయకులు


# పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నాయకులకు, కార్యకర్తలకు మరియు అన్ని వర్గాల ప్రజలకు సామాజిక ఉద్యమ నమస్సులు




ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా ఘనంగా నిర్వహించుదాంసామాజిక ఉద్యమాల పితామహుడుఎస్సీ వర్గీకరణవిజయసారథి అణగారినవర్గాల ఆత్మగౌరవప్రతీకలిమహాజన నేతపద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60వ పుట్టినరోజు వేడుకలుగ్రామగ్రామాన ఘనంగా నిర్వహించుకుందాం చిన్నంబావి మండల కేంద్రంలోజెండాఆవిష్కరణ మరియు మాన్యశ్రీ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60 పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందిసోమవారం ఉదయం మీ గ్రామాలలో జెండా ఆవిష్కరించుకొని మండల కేంద్రంలో 11గంటల ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ ఉంటుంది.కనుక మండల కేంద్రానికి తరలిరావాలని పిలుపునివ్వడం జరుగుతుంది.సామాజిక ఉద్యమ నమస్సులతో.మీ,దేవని రమేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ చిన్నంబావి మండలఅధ్యక్షులు


నిధి అగర్వాల్


రుక్మిణీ వసంత్


త్రిష

# వెంకీ జోడీ ఎవరో!

ఈ ఏడాది ఆరంభంలో 'సంక్రాంతికి వస్తున్నాం'తో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు వెంకటేశ్. ఇప్పుడీ జోష్‌లోనే తన తదుపరి సినిమాకి శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందనున్న ఆ చిత్రాన్ని హారిక అండ్ హాసిని సంస్థ నిర్మించనుంది. దీనిపై ఇంత వరకు అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ.. తెర వెనుక పూర్వ నిర్మాణ పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడీ సినిమాకి సంబంధించిన మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. త్రివిక్రమ్ గత చిత్రాల్లాగే ఇందులో ఇద్దరు నాయికలకు అవకాశముందని సమాచారం. ఇప్పుడా పాత్రల కోసం త్రిష, నిధి అగర్వాల్‌తో పాటు రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం బలంగా వినిపిస్తోంది.వీళ్లలో త్రిష ఇప్పటికే వెంకీతో 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే', 'నమో వెంకటేశ', 'బాడీగార్డ్' చిత్రాల్లో కలిసి సందడి చేసింది. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న 'విశ్వంభర', 'కరుప్పు' పూర్తయిన నేపథ్యంలో.. వెంకీ సినిమాలో సీనియర్ భామగా ఆమెను రంగంలోకి దింపేందుకు చిత్ర వర్గాలు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే మరో పాత్ర కోసం తొలుత రుక్మిణి పేరు వినిపించగా.. ఇప్పుడు నిధి అగర్వాల్ రేసులో ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. మరి వీళ్లలో వెంకీతో జోడీ కట్టేది ఎవరన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు. ఇది వినోదంతో నిండిన కుటుంబ కథా చిత్రంగా కానున్నట్లు చిత్ర వర్గాల్లో ప్రచారం సాగుతోంది. వచ్చే నెలలో చిత్రీకరణ మొదలయ్యే అవకాశముంది. ఇక వెంకీ ప్రస్తుతం చిరంజీవి – అనిల్ రావిపూడి సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నారు.

# అది పూర్తిగా వారి వ్యక్తిగతం..: దీపికా పదుకొణె డిమాండ్‌పై రష్మిక కామెంట్స్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె వర్కింగ్ అవర్స్ ఎక్కువగా ఉన్న కారణంగా ఓ పెద్ద ప్రాజెక్ట్‌ను వదులుకున్నారంటూ కొన్నిరోజులుగా వార్తలు వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే పలువురు స్టార్ హీరో హీరోయిన్స్ స్పందించారు. తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. తాజాగా నటి రష్మిక సైతం ఈ అంశంపై పెదవి విప్పారు. పని వేళలనేవి పూర్తిగా చిత్రబృందానికి సంబంధించిన విషయం అన్నారు. నటిగా తాను ఆయా పరిశ్రమలకు తగిన వర్కింగ్ అవర్స్‌లో పని చేస్తున్నానని వెల్లడించారు."నేను వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్నా. దక్షిణాది చిత్ర పరిశ్రమల్లో ఉద్యోగుల మాదిరిగానే ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వర్కింగ్ అవర్స్ ఉంటాయి. షూట్ తర్వాత కుటుంబసభ్యులతో సమయం కేటాయించడం, డిన్నర్, నిద్ర, మళ్లీ ఉదయాన్నే లేచి షూట్‌కు వెళ్లడం ఇదే పని. కానీ, బాలీవుడ్‌లో అలా ఉండదు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ షిఫ్ట్ ఉంటుంది. సుమారు 12 గంటలు పని చేయాలి. ఒక నటిగా ఈ రెండు రకాల వర్కింగ్ అవర్స్‌లో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా""ఇప్పుడు దేశం మొత్తం అనువైన పనిగంటల గురించి చర్చిస్తుంది. కానీ, అది పూర్తిగా ఒక బృందానికి సంబంధించిన వ్యక్తిగత విషయమని నా అభిప్రాయం. వారికి ఏ విధమైన పనిగంటలు ఉపయోగపడతాయో టీమ్‌లోని సభ్యులందరూ కలిసి చర్చించుకోవాల్సి ఉంటుంది. ప్రతి సినిమాకు సంబంధించి టీమ్ మధ్య ఇలాంటి చర్చ జరగాలి. వారు ఎన్ని గంటలు పని చేయాలనుకుంటున్నారో చర్చించుకోవాల్సిన అవసరం ఉంది. మనం ఎలాంటి షిఫ్ట్‌లో వర్క్ చేయాలనుకుంటున్నామో దర్శకుడికి చెప్పడంలో ఎలాంటి తప్పు లేదు" అని రష్మిక తెలిపారు. సినిమా షూటింగ్ అన్నాక కొన్నిసార్లు పనివేళలతో సంబంధం ఉండదని ఆమె చెప్పారు. ఒక్కోసారి రెండు లేదా మూడు రోజులపాటు సెట్‌లోనే ఉండాల్సి వస్తుందని ఆమె తెలిపారు. ఆ సమయంలో నిద్ర కూడా ఉండదన్నారు.

# విజయ్ రూల్ మిగిలిన హీరోలూ ఫాలో అయితే నిర్మాతలకు సువర్ణావకాశం: దిల్ రాజు



కోలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ పనితీరుపై ప్రశంసలు కురిపించారు నిర్మాత దిల్ రాజు. పని రోజుల విషయంలో విజయ్ క్లారిటీగా ఉంటారని చెప్పారు. సినిమాకు సంబంధించి ఇన్ని రోజులు కేటాయించగలనని ఆయన ముందే చెప్పేస్తారని, మిగిలిన హీరోలూ ఇలాంటి పద్ధతి అనుసరిస్తే బాగుంటుందన్నారు."విజయ్ వర్కింగ్ స్టైల్ భిన్నంగా ఉంటుంది. షూటింగ్ ఎప్పుడు మొదలు పెడతారు, ఎప్పుడు పూర్తి చేస్తారు అనే విషయంపై క్లారిటీగా ఉంటారు. అందుకు అనుగుణంగా ఇన్ని రోజులు కేటాయిస్తానని ముందే చెప్పేస్తారు. సినిమాకు మొత్తం 120 రోజులు అవసరమైతే.. ప్రతి నెలా 20 రోజులు కేటాయిస్తానని చెప్పేస్తారు. దీని వల్ల అనుకున్న సమయానికి సినిమా పూర్తవుతుంది. ఇలాంటి ఆలోచనను ఇతర హీరోలూ ఫాలో అయితే.. నిర్మాతలకు అదొక సువర్ణావకాశం అవుతుంది. ప్రీ ప్రొడక్షన్ కోసం ఇంకాస్త ఎక్కువ సమయం తీసుకుని ఆరు నెలల్లో సినిమా షూట్ పూర్తి చేస్తారు" అని దిల్ రాజు అన్నారు. "ప్రతి నెలా 15 లేదా 20 రోజులు ఇచ్చేసి.. మీరు ఏదైనా ప్లాన్ చేయండి అని చెబితే టీమ్ అందరిపై ఒక పాజిటివ్ ప్రెజర్, బాధ్యత పెరుగుతుంది. అలా ముందుగా అనుకున్నట్లుగా సినిమా షూట్ అవుతుంది. డేట్స్‌కు సంబంధించి టాలీవుడ్‌లో ప్రస్తుతం ఈ పద్ధతి ఎక్కడా కనిపించడం లేదు. తిరిగి ఇలాంటి పరిస్థితులు తీసుకొచ్చేందుకు మేము వర్క్ చేస్తున్నాం" అని దిల్ రాజు తెలిపారు.విజయ్ హీరోగా దిల్ రాజు 'వారిసు' / 'వారసుడు' చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. 2023లో ఈ సినిమా విడుదలై మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఆయన నిర్మాతగా వ్యవహరించిన తాజా చిత్రం 'తమ్ముడు'. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇండస్ట్రీలో కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 'దిల్ రాజు డ్రీమ్స్' పేరుతో నూతన నిర్మాణ సంస్థను ఆయన ప్రారంభించారు.

# నాకొక ఐడెంటిటీ ఇచ్చారు..: స్టేజ్‌పై సమంత ఎమోషనల్



నటి సమంత తానా వేడుకల్లో పాల్గొన్నారు. అభిమానులు చూపిస్తోన్న ప్రేమ పట్ల భావోద్వేగానికి గురయ్యారు. "తానా వేడుకల్లో పాల్గొనడానికి 15 ఏళ్లు పట్టిందంటే నమ్మలేకపోతున్నా. ప్రతి ఏడాది తానా, ఇక్కడ ఉన్న తెలుగువారి గురించి వింటూనే ఉంటాను. నా తొలి చిత్రం 'ఏమాయ చేసావె' నుంచి నన్ను మీ మనిషిలా భావించారు. నాపై ప్రేమను చూపించారు. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు చెప్పడానికి నాకు ఇన్ని ఏళ్లు పట్టింది" అంటూ శిరస్సు వంచి నమస్కారం చేశారు."కెరీర్ పరంగా ముఖ్యమైన దశలో ఉన్నాను. ట్రాలాలా పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించా. నిర్మాతగా 'శుభం'తో తొలి అడుగు వేశా. నార్త్ అమెరికాకు చెందిన తెలుగువారు మా చిత్రాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. మంచి ఫలితాన్ని అందించారు. జీవితంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. ఏదైనా తప్పు చేసినా.. మీరు ఎప్పుడూ నా వెంటే ఉన్నారు. అందుకు గర్వపడుతున్నా. ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా, ఏ పరిశ్రమలో పనిచేసినా.. 'తెలుగు ప్రేక్షకులు నన్ను చూసి గర్వపడతారా? లేదా?' అనే ఆలోచిస్తాను. ఇన్నేళ్ల ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు. మీరు నాకొక ఐడెంటిటీ, కుటుంబాన్ని ఇచ్చారు. 'ఓబేబీ' మిలియన్ డాలర్ క్లబ్‌లోకి చేరడం మీవల్లే సాధ్యమైంది. ప్రాంతాలను బట్టి మీరు నాకు దూరంగా ఉండొచ్చు.. కానీ మీరెప్పటికీ నా మనసులోనే ఉంటారు" అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టుకున్నారు.

# 'లక్కీ భాస్కర్' సీక్వెల్ చేస్తా: వెంకీ అట్లూరి



దుల్కర్ సల్మాన్ హీరోగా దర్శకుడు వెంకీ అట్లూరి రూపొందించిన చిత్రం 'లక్కీ భాస్కర్' . బ్యాంకింగ్ సెక్టార్ నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం గతేడాది విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రానికి సీక్వెల్ తీసే ఆలోచనలో ఉన్నట్లు వెంకీ అట్లూరి తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 'లక్కీ భాస్కర్'కు తప్పకుండా సీక్వెల్ ఉంటుందన్నారు. సీక్వెల్‌కు సంబంధించిన ఇతర వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.'లక్కీ భాస్కర్' విజయం తర్వాత సూర్య హీరోగా వెంకీ కొత్త సినిమా రూపొందిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా అధికారికంగా ప్రారంభమైంది. సూర్య 46వ ప్రాజెక్ట్‌గా సిద్ధమవుతోన్న ఈ సినిమాపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "లక్కీ భాస్కర్' సక్సెస్ అయ్యాక బయోపిక్స్ చేయాలని పలువురు నిర్మాతలు నన్ను సంప్రదించారు. కానీ, నాకు మాత్రం వాటిని తెరకెక్కించడం ఇష్టం లేదు. అదే విధంగా థ్రిల్లర్, పీరియాడిక్ చిత్రాలు రూపొందించాలనే ఆసక్తి లేదు. కుటుంబం మొత్తం కలిసి కూర్చొని చూసేలా అందమైన కుటుంబ కథా చిత్రాలను చేయాలనిపించింది. అందుకు అనుగుణంగానే ఇప్పుడు సినిమా చేస్తున్నా" అని అన్నారు.సూర్యకు తాను వీరాభిమానిని అని అన్నారు. సూర్యకు తాను రెండు, మూడు కథలు చెప్పానని.. అందులో నుంచి ఆయన ఒక స్టోరీ ఎంచుకున్నారని తెలిపారు. ఇది పూర్తిగా కుటుంబ కథా చిత్రమన్నారు. తెలుగు, తమిళ భాషల్లో నిర్మితం కానున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవికి ప్రేక్షకుల ముందుకు రానుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మమితా బైజు కథానాయిక. రవీనా టాండన్, రాధిక కీలక పాత్రలు పోషిస్తున్నారు.